


ట్రైనీ ఎఫ్ఆర్వోల పర్యటన

జన్నారం, ఆగస్టు 28: కవ్వాల టైగర్ జోన్‌లోని జన్నారం డివిజన్‌లో గల ఇందన్‌పల్లి రేంజ్‌అటవీ ప్రాంతంలో బుధవారం దూలపల్లికి చెందిన 11వ బ్యాచ్ ట్రైనీ ఎఫ్ఆర్వోలు పర్యటించారు. మైసమ్మ కుంట, ఘన్‌శెట్టి కుంటలో పక్షులను వీక్షించారు. భైసన్‌కుంటలోని గడ్డి క్షేత్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా వారు కవ్వాల టైగర్ రిజర్వ్‌లో ఉండే వన్య ప్రాణులపై అధ్యయనం చేశారు. అడవిలోని చెట్ల రకాలు, వన్య ప్రాణుల గురించి ఎఫ్ఆర్వో హఫీజుద్దీన్ వివరించారు. కార్యక్రమంలో అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

జ్వరాలు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి

- ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి



కొల్లూరులో వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి

కోటపల్లి, ఆగస్టు 28: జ్వరాలు ప్రబలకుండా వైద్యాధికారులు, సిబ్బంది సత్వరం చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి అన్నారు. మండలంలోని కొల్లూరు గ్రామంలో గత కొన్ని రోజులుగా పలువురికి జ్వరాలు సోకుతుండడం, గ్రామంలో నాలుగు రోజులుగా వైద్య శిబిరం నిర్వహిస్తుండగా బుధవారం ఎమ్మెల్యే గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలోజ్వరాలు ఎందుకు సోకాయి, ప్రస్తుత పరిస్థితి ఏమిటి, వైద్య శిబిరాలు ఎన్ని రోజులుగా కొనసాగిస్తున్నారు, మందుల పంపిణీ జరుగుతుందా, రక్త పరీక్షలు చేస్తున్నారా తదితర అంశాలపై వైద్యాధికారిణి అరుణశ్రీని అడిగి తెలుసుకున్నారు. వైద్య శిబిరం వద్ద మందులను పరిశీలించిన ఆయన అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఎవరికైనా పరిస్థితి తీవ్రంగా ఉంటే పట్టణ ఆసుపత్రులకు తరలించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. అలాగే గ్రామంలో పారిశుధ్యపనులను చేపట్టాలన్నారు. గ్రామంలో అంతర్గత రోడ్డు సదుపాయం కల్పించాలని గ్రామస్తులు కోరగా సానుకూలంగా స్పందించిన ఆయన రోడ్డు వేయిస్తామని హామీఇచ్చారు. అలాగే జాతీయ రహదారిపై బస్‌సెల్టర్ కావా లని గ్రామస్తులు కోరగా ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజమల్లగౌడ్, మాజీ సింగిల్ విండో చైర్మన్ బాపురెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మహేష్ ప్రసాద్ తివారీ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

చెన్నూరు: మండలంలోని ఆస్నాద గ్రామంలో ఇటీవల ఇల్లు కాలిపోయిన బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి పరామర్శించారు. వ్యక్తిగతంగా ఆర్థిక సహాయం అందజేశారు. ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఆయన వెంట మాజీ జడ్పీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి, సత్యనారాయణగౌడ్ తదితరులు ఉన్నారు.

అభివృద్ధి పథంలో యూనివర్సల్ బ్యాంకు



మాట్లాడుతున్న బ్యాంకు చైర్మన్ వినయ్‌కుమార్

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 28: యూనివర్సల్ బ్యాంకు అభివృద్ధి పథంలో నడుస్తుందని బ్యాంకు చైర్మన్ వినయ్‌కుమార్ సూచించారు. జిల్లా కేంద్రంలోని వైశ్య భవన్‌లో బుధవారం మంచిర్యాల బ్యాంకు 46వ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023-24 ఆర్థిక సంతవ్సరంలో రూ. 76.35 లక్షల నికర లాభం వచ్చిందని తెలిపారు. ఈ సంవత్సరానికి గాను వాటాదారులకు 11 శాతం డివిడెంట్ ప్రకటించామన్నారు. మంచిర్యాల, సీసీసీలలో ఏటీఎం సౌకర్యం కల్పించామని తెలిపారు, సీనియర్స్ సిటిజన్‌లకు ఇతర బ్యాంకుల కన్నా డిపాజిట్‌లపై ఎక్కువ వడ్డీ ఇస్తున్నామని, సీనియర్ సిటిజన్స్ బ్యాంకుకు రాలేని పక్షంలో వారికి ఇంటికి వెళ్లి సర్వీసు అందిస్తున్నామని తెలిపారు. జిల్లా సహకార అధికారి సంజీవరెడ్డి మాట్లాడుతూ బ్యాంకు ఖాతాదారులకు మెరుగైన సేవలందించాలని సూచించారు. బ్యాంకు ఇన్‌చార్జీ సీఈవో మూర్తి మాట్లాడుతూ బ్యాంకు చిన్న మధ్య తరగతి ప్రజలకు రుణసదుపాయం కల్పిస్తూ ఆర్థిక ప్రగతికి దోహదం చేస్తుందన్నారు. బ్యాంకు నుంచి రూపే డెబిట్ కార్డులు, క్యూఆర్ స్కానర్‌లు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు వైస్ చైర్మన్ పూర్ణచంద్రరావు, డైరెక్టర్‌లు కృష్ణమూర్తి, శ్రీదేవి, బక్కయ్య, ప్రసాదరావు, రాజలింగు, భాను ప్రకాష్, రత్నం, సుశీల, భాగ్యలక్ష్మీ, ఆదిత్య, శ్రీనివాస్, వాటాదారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్ల కార్యవర్గం

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 28: ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్ల కార్యవర్గాన్ని బుధవారం డీఐఈవో కార్యాలయంలో ఎన్నుకున్నారు. లక్సెట్టిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుడు, జిల్లా ఉపాధ్యక్షుడు పి శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. 2024-2026 విద్యా సంవత్సరానికి సంబంధించి నూతన కార్యవర్గం ఎన్నికైంది. అధ్యక్షుడిగా ఎన్ శంకర్ (ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, కాసిపేట), ప్రధాన కార్యదర్శిగా ఎ అంజయ్య (ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, సీటీ, బెల్లంపల్లి), ఉపాధ్యక్షుడిగా కె లక్ష్మణ్‌రావు (ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, లక్సెట్టిపేట), మహిళా కార్యదర్శిగా టి స్వరూప (ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, బెల్లంపల్లి) ఎన్నికయ్యారు.

సమస్యల తిష్ఠ



- అభివృద్ధికి నోచుకోని బెల్లంపల్లి మున్సిపాలిటీ
- దశాబ్ద కాలంగా ప్రజలకు తాగునీటి ఇబ్బందులు
- చెత్తతో కంపు కొడుతున్న పలు వార్డులు
- పారిశుధ్య లోపంతో జ్వరాల బారిన ప్రజలు
- కోట్ల రూపాయల ప్రజాధనం వృధా
- పట్టించుకోని పాలకవర్గం, అధికారులు

బెల్లంపల్లి, ఆగస్టు 28: బెల్లంపల్లి మున్సిపాలిటీలో సమస్యలు పేరుకుపోయాయి. మున్సిపాలిటీలోని ప్రజలు కనీస మౌలిక వసతులకు నోచుకోవడం లేదు. తాగునీరు, పారిశుధ్యం, డ్రైనేజీ సమస్యలు, రోడ్లపై గుంతలు, డంపింగ్‌యార్డు లేకపోవడంతో సమస్యలు ప్రధానంగా ప్రజలను పట్టి పీడిస్తున్నాయి. మున్సిపల్ పాలకవర్గం, అధికారుల సమ న్వయలోపంతో మున్సిపల్ నిధులు అభివృద్ధికి కేటాయించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో కోట్ల రూపాయల ప్రజాధనం వృధా అవుతోంది.

పట్టణంలోని 34 వార్డుల్లో..

బెల్లంపల్లి మున్సిపాలిటీలో మొత్తం 34 వార్డులు ఉన్నాయి. ఈ వార్డుల్లోని ప్రజలు దశాబ్ద కాలంగా తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గోదావరి నీటి కోసం పట్టణ ప్రజలు ఎదురు చూస్తూనే ఉన్నారు. పట్టణ ప్రజలకు గోదావరి నీరు అందించేందుకు 2011లో రూ. 18 కోట్లతో ఎల్లంపల్లి నుంచి బెల్లంపల్లికి గోదావరి తాగునీటి పథకం చేపట్టారు. ఇందుకు సంబంధించి పట్టణంలోని రైల్వేస్టేషన్ ముందు ఓవర్ హెడ్ ట్యాంకు, ఫిల్టర్ బెడ్ నిర్మించారు. 2014లో పను లు పూర్తయినప్పటికీ చాలా చోట్ల పైపులైన్‌లకు లీకేజీలు ఏర్పడడంతో నీరు రాకుండా నిలిచిపోయింది. రైల్వేస్టేషన్ ఎదుట ఫిల్టర్‌బెడ్‌లు, పంప్ హౌస్‌లు ముందు చూపు లేకుండా నిర్మించడంతో వర్షాకాలం నీటిలో మునిగిపోతున్నాయి. రూ. 18 కోట్లు వ్యయం చేసినా ఈ పథకం 13 ఏండ్లుగా నిరుపయోగంగానే ఉండడం గమనార్హం.

అలాగే బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మిషన్ భగీరథ పథకం కింద మున్సి పాలిటీలో ప్రజలకు తాగునీరందించేందుకు రూ. 31 కోట్ల నిధులతో ఓవర్ హెడ్ ట్యాంకులను ఏర్పాటు చేశారు.అయినప్పటికీ ప్రస్తుతం ప్రజలకు మిషన్ భగీరథ నీరు మూడు రోజులకు ఒకసారి వస్తుండ డంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే సింగరేణి సైతం పలు వార్డుల్లో శాంతిఖని గద్ద నిర్మించిన ఫిల్టర్ బెడ్ ద్వారా సరఫరా చేసే నీరు వారానికి రెండు రోజులు వస్తుండడంతో వానాకాలం సైతం ప్రజలు తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పేరుకుపోతున్న చెత్తాచెదారం..

పలు వార్డుల్లో ఎక్కడ చూసినా ఇండ్ల పరిసరాల్లో, రోడ్ల పక్కన చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. ఇంటింటా చెత్త సేకరణ గాడి తప్పుతోంది. ప్రధానంగా పట్టణంలో డంపింగ్‌యార్డు లేకపోవడంతో ఇళ్లల్లో పోగు చేసిన చెత్తను పారిశుధ్య కార్మికులు ఆటో ట్రాలీల ద్వారా ఖాళీ స్థలాల్లో వి చ్చల విడిగా పడేస్తున్నారు. అలాగే కొందరు కాలనీ వాసులు డ్రైనేజీలు, ఖాళీ స్థలల్లో చెత్త వేయడంతో మురిగి కంపు కొడుతుంది. దీంతో దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి.

ముందుచూపు లేకుండా..

అధికారులు, పాలకవర్గం ముందు చూపు లేకుండా బెల్లంపల్లి మున్సిపాలిటీ నిధులు వినియోగిస్తుండడంతో కోట్ల రూపాయల ప్రజాధనం వృధా అవుతుంది. పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాల వెనకాల దాదాపు రూ. 2 కోట్లకు పైగా మున్సిపల్ నిధులతో డంపింగ్‌యార్డును నిర్మించారు. ఈ డంపింగ్‌యార్డు కొన్ని నెలల పాటు ఉపయోగపడింది. ఉపయోగపడిన రోజుల్లో సైతం ఇళ్ల పరిసరాలకు డంపింగ్‌యార్డు దగ్గరగా ఉండడంతో చెత్తను కాల్చివేసినప్పుడు స్థానిక ప్రజలు రసాయనాల పొగతో వ్యాధుల బారిన పడ్డారు. అంతేకాకుండా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 350 ఎకరాల్లో ఫుడ్‌జోన్‌ను ఏర్పాటు చేశారు. ఈ ఫుడ్ జోన్ ఏర్పాటు చేసిన స్థలంలోనే డంపిగ్‌యార్డు ఉండడంతో ప్రస్తుతం ఈ డంపింగ్‌యార్డును ఉపయోగించడం లేదు. అలాగే చెత్త సేకరణ కోసం రెండేండ్ల క్రితం మున్సిపల్ నిధుల నుంచి రూ. 20 లక్షలతో డోజర్ ట్రాక్టర్‌ను కొనుగోలు చేశారు. ఈ డోజర్ ట్రాక్టర్‌తో చిన్న చిన్న పనులు మాత్రమే చేయాలి.

మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఇష్టం వచ్చినట్లు పెద్ద కట్టడాలు కూల్చడం, గుంతలు పూడ్చడం చేయడంతో పాడైపోయి మూలన పడింది. అలాగే చెత్త సేకరణకు నిర్వహించే ట్రాక్టర్‌లు, ఆటో ట్రాలీలు ఒక్కోదానికి రూ. 4 లక్షలు వెచ్చించి కొనుగోలు చేశారు. ఇందులో దాదాపు 10కిపైగా చెత్త ట్రాలీలు చిన్న చిన్న మరమ్మతులకు నోచుకోక పోవడంతో మూలన పడ్డాయి. అలాగే వీధి వ్యాపారుల కోసం లక్షల రూపాయలు ఖర్చు చేసి కాల్‌టెక్స్, బజార్ ఏరియాల్లో షెడ్లను ఏర్పాటు చేశారు. అవి చిరు వ్యాపారులకు కేటాయించకపోవడం, నిరు పయోగంగా ఉండడంతో మున్సిపాలిటీకి ఆదాయం సమకూరడం లేదు. ఇలా అధికారులు, పాలకవర్గ సమన్వ య లోపంతో కోట్ల రూపాయల ప్రజాధనం వృధా అవుతోంది. కాగా పాలకవర్గంలో విభేదాలు, ఆధిపత్య పోరుతో పాలన గాడి తప్పుతుం దనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మున్సిపల్ అధికారులు, ప్రజాప్ర తినిధుల సమన్వయ లోపంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.



నిరుపయోగంగా వాహానాలు



పిచ్చి మొక్కలతో నిండిపోయిన పంప్ హౌస్

తాగునీరు అందక ఇబ్బందులు.. : లింగమ్మ, బెల్లంపల్లి



మూడు, నాలుగు రోజులకు ఒకసారి తాగునీరు వస్తుండడంతో ఇబ్బందులు పడుతున్నాం. గోదావరి నీటి కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్నాం. గోదావరి నీరు రాకపోవడంతో ఒక్కోసారి నీటిని సైతం కొనుగోలు చేయాల్సి వస్తుంది. ప్రతి రోజు నీటి సర ఫరా చేయకుండా అధికారులు , పాలకవర్గం ఇబ్బందులకు గురి చేస్తుం ది. నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలి. గోదావరి నీటిని అందించాలి.

ప్రజాధనం వృధా: సబ్బని రాజేంద్ర ప్రసాద్, బెల్లంపల్లి



అధికారులు, మున్సిపల్ పాలకవర్గం సమన్వయ లోపంతో కోట్ల రూపాయల ప్రజాధానాన్ని వృధా చేస్తున్నారు. కోట్ల రూపాయల వ్యయంతో డంపింగ్ యార్డు, రక్షిత నీటి పథకం ఏర్పాటు చేసినప్పటికీ వినియోగించుకోలేని పరిస్థితుల్లో ఉన్నాయి. ముందు చూపు లేకుండా వీటిని నిర్మించడంతో నిధులు నీళ్ల పాలయ్యాయి. మున్సిపల్ నిధులను అభివృద్ధికి వినియోగించుకుంటే ప్రజల సమస్యలను తీర్చవచ్చు. ఆ దిశగా పాలకవర్గం, యంత్రాంగం చర్యలు తీసుకోవాలి.

వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ కుమార్ దీపక్



చెన్నూరు ఆస్పత్రిలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

చెన్నూరు, ఆగస్టు 28: విష జ్వరాల వ్యాప్తి చెందకుడా వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. చెన్నూరులోని వంద పడకల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం సందర్శించారు. వార్డులు, పరిసరాలు, రిజిష్టర్‌లు పరిశీలించి రోగులకు అందిస్తున్న వైద్య సేవల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు, విష జ్వరాల నియంత్రణకు అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని, వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయ పాలన పాటించాలని, ఆసుపత్రికి వచ్చేవారికి మెరుగైన వైద్య సేవలందించాలని తెలిపారు. తాగునీరు, ఆహారం తీసుకునే విషయంలో జాగ్రత్తలు వహించాలని, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించేలా వివరించా లన్నారు గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి వైద్య సేవలందించాలని సూచించారు. విష జ్వరాల అనుమానితుల రక్తమూత్ర నమూనాలను సేకరించి అవసరమైన పరీక్షలు నిర్వహించి వ్యాధి నిర్ధారణ అయిన తర్వాత సంబంధిత వైద్య సేవలు అందించాలని తెలిపారు. కలెక్టర్ వెంట ఆసుపత్రి వైద్యులు ఉన్నారు.

● ప్రజలను చైతన్యం చేయాలి

కోటపల్లి, ఆగస్టు 28: గ్రామాల్లో ప్రతినిత్యం పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహించాలని, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలను చైతన్యవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మండల కేంద్రంతో పాటు సర్వాయిపేట , ఎడగట్ట గ్రామాలను బుధవారం సందర్శించిన కలెక్టర్ పారిశుధ్య పనులను పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేకాధికారులు, మండల అధికారులు నిర్లక్ష్యం వీడి ప్రజలకు అందుబాటులో ఉంటూ పారిశుధ్య కార్యక్రమాలపై దృష్టి పెట్టాలన్నారు. అంటు వ్యాధులు సోకుతున్నందున వ్యాధులు సోకకుండా ముందస్తుగా చర్యలు చేపట్టాలని , దోమల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. నీటి వనరుల వద్ద క్లోరినేషన్, మురుగుగుంతల వద్ద బ్లీచింగ్ పౌడర్ చల్లించాలన్నారు. వైద్య సిబ్బంది గ్రామాల్లోని ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలందించాలని, ప్రజలకు ప్రభుత్వ వైద్యం అందించాలన్నారు.

● పాఠశాలల సందర్శన

మండల కేంద్రంలోని కేజీబీవీ, సర్వాయిపేట ప్రాథమిక పాఠశాలలను కలెక్టర్ కుమార్ దీపక్ సందర్శించారు. సర్వాయిపేట పాఠశాలలో విద్యార్థుల అభ్యాసన తీరును పరిశీలించిన కలెక్టర్ పాఠ్య పుస్తకంలోని పాఠాలను విద్యార్థులతో చదివించారు. బోర్డుపై రాస్తూ పాఠాలు చెప్పారు. కేజీబీవీ విద్యాలయంలో వసతులు, సౌకర్యాలపై ఆరా తీశారు. భోజనం పరిశీలించి మెనూ ప్రకారం అందించాలని సూచించారు. వంటగదిని పరిశుభ్రంగా ఉంచాలన్నారు. కలెక్టర్ వెంట ఎంపీడీవో సత్యనారాయణ, కేజీబీవీ ప్రత్యేకాధికారిణి హరిత, పంచాయతీ కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

దివ్యాంగుల హక్కుల సాధనే లక్ష్యం

మందమర్రి టౌన్, ఆగస్టు 28: దివ్యాంగుల హక్కుల సాధనే లక్ష్యంగా తమ సంఘం పని చేస్తుందని ఆ సంఘం జాతీయ నాయకులు పెద్దపల్లి సత్యనారాయణ తెలిపారు. మందమర్రిలో బుధవారం దివ్యాంగుల పోరాట సమితి ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు ఆరు వేల రూపాయల పెన్షన్‌కై పోరాడుతామన్నారు. ప్రభుత్వం దివ్యాంగులకు బ్యాంకుల్లో ప్రత్యేక రుణాలు కల్పించాలని, నడవలేని దివ్యాంగులకు ట్రైసైకిల్‌ను అందజేయాలని కోరారు. దివ్యాంగులకు ప్రభుత్వం అన్ని విధాల చేయూతనిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బానోతు రాజు, మల్లేష్, సురేష్, నరేష్, అఖిల, తదితరులు పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: దివ్యాంగులకు రాష్ట్ర ప్రభుత్వం నెలకు రూ. 6 వేల పింఛన్ అందజేయాలని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ నాయకులు పెద్దపల్లి సత్యనారాయణ కోరారు. పులిమడుగు గ్రామంలో సమితి ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఇందూరి రమేష్, బండోజు నరేష్, రాజు, రవి, రాందాస్, మల్లేష్, నరేష్, సురేష్ , సుశీల, అఖిల పాల్గొన్నారు.

క్విజ్ పోటీల పోస్టర్ల విడుదల

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 28: కలెక్టరేట్ కార్యాలయంలో బుధవారం ఆర్‌బీఐ 90 క్విజ్ పోటీల పోస్టర్లను కలెక్టర్ కుమార్ దీపక్, రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా ఏజీఎం మహ్మద్ జయూర్ రహెమాన్ విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా సంస్థ స్థాపించి 90 సంవ త్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా క్విజ్ పోటీలను నిర్వహించను న్నామని తెలిపారు. కార్యక్రమంలో లీడ్ డిస్టిక్ మేనేజర్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

జ్వరాల పంజా

- జలుబు, దగ్గుతో ప్రజల అవస్థలు
- నెల రోజుల్లో తొమ్మిది డెంగీ కేసులు
- ఆస్పత్రులకు రోగుల తాకిడి



జ్వరంతో చికిత్స పొందుతున్న రోగులు

చెన్నూరు, ఆగస్టు 28: చెన్నూరు నియోజకవర్గంలో జ్వరాలతో ప్రజలు విలవిలలాడుతున్నారు. నెల రోజుల వ్యవధిలోనే చెన్నూరు ప్రభుత్వ ఆస్పత్రిలో తొమ్మిది డెంగీ కేసులు నమోదు కావడంతో ప్రజలు ఆందోళనకు గురవు తున్నారు. వీటికి తోడు విష జ్వరాలు, దగ్గు, జలుబు సమస్యలు తీవ్రంగా వేధిస్తున్నాయి. నెల రోజులుగా విష జ్వరాలతో అల్లాడుతున్న ప్రజలు డెంగీ బారిన పడడంతో భయాందోళనలకు గురవుతున్నారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో పదుల సంఖ్యలో డెంగీ కేసులు నమోదైనట్లు సమాచారం. చెన్నూరు సామాజిక ఆరోగ్య కేంద్రం (ప్రభుత్వ ఆసుపత్రి)లో బుధవారం 259 మందికి రక్త పరీక్షలు నిర్వహించినట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ఇందులో 111 మంది జ్వరాల బారిన పడినట్లు నిర్ధారించారు. వాతావరణ మార్పులతో నెల రోజులుగా వైరల్ జ్వరాలు పట్టి పీడిస్తున్నాయి. జ్వర పీడితులకు తెల్ల రక్త కణాల సంఖ్య పడిపోతుండడంతో రోగులు ఆందోళన చెందుతున్నారు.

- రెండు మండలాల్లో..

చెన్నూరు, కోటపల్లి మండలాల్లో పారిశుధ్యం లోపించి దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. దోమల కారణంగా ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. గత పక్షం రోజుల నుంచి వైరల్ జ్వరాలు సోకి నియోజకవర్గ ప్రజలు ఆస్పత్రులకు వస్తున్నారు. జ్వర పీడితులతో ఆస్పత్రులన్నీ కిక్కిరిసిపోతున్నాయి. చెన్నూరు ప్రభుత్వ ఆసుపత్రిలోని వార్డులన్నీ జ్వర పీడితులతో నిండిపోయాయి. చెన్నూరు పట్టణంతో పాటు మండ లంలోని నాగాపూర్, నారాయణపూర్, బుద్దారం, సంకారం, కన్నెపల్లి, దుగ్నేపల్లి, సోమనపల్లి, కోటపల్లి మం డలంలోని కొల్లూరు, అన్నారం, సిర్సా, ఏదు లబంధం తదితర గ్రామాల్లో పారిశుధ్య పరిస్థితి అధ్వా నంగా మారిందని ప్రజలు చెబుతున్నారు.

- పారిశుధ్య లోపం..

నియోజకవర్గంలోని చెన్నూరు, కోటపల్లి, భీమారం, జైపూర్ మండలాల్లో పారిశుధ్యం లోపించింది. దీంతో దోమలు క్రిమికీటకాలు వృద్ధి చెంది ఆయా గ్రామాల ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. పదిహేను రోజులుగా చెన్నూరు, కోటపల్లి మండలాల్లో జ్వరాలు పట్టి పీడిస్తున్నాయి. గ్రామాల్లో ఇంటికి ఒకరు చొప్పున మంచం పట్టారు. ఆర్థికంగా ఉన్న వారు ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా ఆర్థికంగా లేని వారు ప్రభుత్వ ఆస్పత్రికి పరుగులు తీస్తున్నారు. కాగా నియోజకవర్గంలో దోమల నివారణ చర్యల జాడేలేదు. దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టాల్సి ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. మురికి కాలువలు , నాలాల్లో బైటెక్స్ ద్రావణంతో పాటు బ్లీచింగ్ పౌడర్ నిత్యం వేయాల్సి ఉన్నప్పటికీ ఎక్కడా వేసినట్లు కనిపించడం లేదు.

మూడు రోజులుగా జ్వరం..



మూడు రోజుల క్రితం జ్వరం రావడంతో ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చి చేరాను. వైద్య పరీక్షలు చేయించు కున్నాను. వైరల్ ఫీవర్ అని వైద్యు లు తెలిపారు. సిబ్బంది చికిత్స అందిస్తున్నారు.

-నూతికట్ల సత్యనారాయణ, చెన్నూరు

రక్తకణాలు తగ్గాయి..



వారం రోజుల నుంచి జ్వరం వస్తుంది. చెన్నూరు ప్రభు త్వ ఆసుపత్రికి వచ్చి వైద్య పరీక్షలు చేయించుకోవడంతో తెల్ల రక్తకణాలు తగ్గినట్లు వైద్యులు నిర్ధారించారు. నాతో పాటు నా తండ్రి బడికెల గట్టయ్యకు సైతం జ్వరం రావడంతో ప్రభుత్వ ఆస్పత్రిలోనే వైద్యం తీసుకుంటున్నాం.

- బడికెల శృతి , నాగాపూర్, చెన్నూరు మండలం

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి..

ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి. ఆస్పత్రిలో పరీక్షలు నిర్వహిస్తున్నాం. ఎలీషా పరీక్షల ద్వారా డెంగీ నిర్ధారణ అయితేనే వ్యాధి ఉన్నట్లు. ఆస్పత్రిలో డెంగీ, మలేరియా పరీక్షలు నిర్వహిస్తున్నాం. చెన్నూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఇప్పటి వరకు తొమ్మిది డెంగీ పాజిటివ్ కేసులను నిర్ధారించాం.

-సత్యనారాయణ, ఆస్పత్రి సూపరింటెండెంట్

మహిళలపై వేధింపులను అరికట్టాలి

శ్రీరాంపూర్, ఆగస్టు 28: మహిళలపై వేధింపులను అరికట్టాలని ప్రగతిశీల మహిళా సంఘం(పీఓడబ్ల్యూ) రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎం జ్యోతి అన్నారు. హైదరాబాద్‌లో ఈ నెల 31న నిర్వహించనున్న పీఓడబ్ల్యూ 7వ మహాసభలకు చెందిన పోస్టర్లను శ్రీరాంపూర్‌లో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జ్యోతి మాట్లాడుతూ, ప్రస్తుత సమాజంలో మహిళలపై వేధింపులు పెరిగాయని చెప్పారు. మహిళల రక్షణకు పలు చట్టాలు తీసుకొచ్చినా వాటి అమలులో ప్రభుత్వాలు చిత్తశుద్ధి చూపడం లేదన్నారు. ఫలితంగా అకృత్యాల ఆగడం లేదన్నారు. తమ సంఘం ఆధ్వర్యంలో మహిళలపై వేధింపులు, అత్యాచారాల నివారణ, సమానపనికి సమాన వేతనం కోసం ఉద్యమిస్తున్నట్లు చెప్పారు. హైదరాబాద్‌లో ఈ నెల 31న నిర్వహించే మహాసభలకు మహిళలు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శిరీష, శారద, కవిత, లక్ష్మీ, మల్లేశ్వరీ, కమలమ్మ, విజయ, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వసతుల కల్పనకు కృషి

- ఎమ్మెల్సీ దండె విఠల్

బెజ్జూరు, ఆగస్టు 28: ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలల్లో మెరుగైన వసతుల కల్పనకు కృషిచేస్తానని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. మండలంలోని సోమిని ప్రభుత్వగిరిజన ఆశ్రమపాఠశాలను బుధవారం రాత్రి సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మరుగుదొడ్లు, అదనపు గదులతో పాటు మంచినీటి సౌకర్యం కల్పించాలని విద్యార్థులు కోరగా ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. మాజీజడ్పీటీసీ పుష్పలత బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరగా పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ మెంబర్ హర్షద్ హుస్సేన్, మాజీ ఎంపీ పీలు నానయ్య, విశ్వనాథ్, నాయకులు శ్రీవర్ధన్,రాజన్న, సురేష్ గౌడ్, నాహీర్ హుస్సేన్ పాల్గొన్నారు.

సినిమా వార్తల కోసం
www.andhrajyothy.comను క్లిక్ చేయండి

రైతులు రసాయన ఎరువులు వాడొద్దు

బెల్లంపల్లి, ఆగస్టు 28: రైతులు పంటలకు రసాయన ఎరువులను వాడవద్దని బెల్లం పల్లి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ కోట శివకృష్ణ అన్నారు. కృషివిజ్ఞాన కేంద్రంలో రైతులకు బుధవారం పంట వ్యర్థాల నుంచి వర్మీకంపోస్టు తయారీ విధానం, తేనెటీగల పెంపకంపై శిక్షణ కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు తిరుపతి, స్రవంతి, నాగరాజు, రైతులు పాల్గొన్నారు.

యాప్‌లో వివరాలు నమోదు

కాసిపేట, ఆగస్టు 28: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రైతు రుణమాఫీ పథకంలో అర్హులై ఉండి లబ్ధిపొందని రైతుల కుటుంబ వివరాలను రుణమాఫీ యాప్‌లో బుధవారం నుంచి నమోదు చేశామని మండల వ్యవసాయాధికారి ప్రభాకర్ తెలిపారు. ముత్యంపల్లి గ్రామీణ బ్యాంకు పరిధిలో 348 మంది రైతులు అర్హత ఉండి కూడా సాంకేతిక లోపాల వల్ల పంట రుణమాఫీ రాలేదని గుర్తించామని తెలిపారు.

మందమర్రిరూరల్: మండలంలోని సారంగపల్లి గ్రామంలో బుధవారం రుణమాఫీ రాని రైతుల వివరాలను ఏవో కిరణ్మయి, ఏఈవో ముత్యం తిరుపతిలు రైతుల ఇళ్ల వద్దకు వెళ్లి నిర్ధారణ చేసుకుని రుణమాఫీ యాప్‌లో నమోదు చేశారు. 25 కుటుంబాలను నిర్ధారణ చేసి యాప్‌లో నమోదు చేసినట్లు తెలిపారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

బెల్లంపల్లి, ఆగస్టు 28: బెల్లంపల్లి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో పని చేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికుల పెండింగ్ వేతనాలను చెల్లించాలని సీఐటీయూ మాజీ జిల్లా కార్యదర్శి సంకె రవి కోరారు. బుధవారం ఆసుపత్రిలోని కాంట్రాక్టు కార్మికులు పలువురు సీఐటీయూలో చేరారు. కార్యక్రమంలో రమేష్, కనకలక్ష్మి, జానకి, శే ఖర్, సాయికుమార్, అన్వర్, శ్రీకాంత్, నాగమణి, విజయ, తిరుపతి, సరిత పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సాయం

దండేపల్లి, ఆగస్టు 28: దండేపల్లి మండలం రాజుగూడ పంచాయతీ పరిధిలోరి జైతుగూడ చెందిన మర్సుకోల లింగుపటేల్ అనే కాంగ్రెస్ పార్టీ కార్యకర్త మృతి చెందగా బుధవారం బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కంది సతీష్ కుమార్ మూడు వేల రూపాయలు అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మండల డైరెక్టర్ కనక జంగు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం

జన్నారం, ఆగస్టు 28: మండల కేంద్రంలో ఇటీవల ఉత్తమ తహసీల్దార్‌గా అవార్డు అందుకున్న తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డిని బుధవారం మాజీ సర్పంచు నందునాయక్ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రియాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

షాపింగ్‌మాల్ యజమానులపై చర్యలు తీసుకోవాలి

ఏసీసీ, ఆగస్టు 28: మంచిర్యాల పట్టణంలోని బస్టాండ్ ఏరియాలో పార్కింగ్ సౌకర్యం లేకుండా నిర్వహిస్తున్న సీఎంఆర్ షాపింగ్‌మాల్ యజమానులపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు బుధవారం మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎస్ఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోపాల్, విద్యార్థి సమాఖ్య జిల్లా అధ్యక్షుడు క్రాంతికుమార్, విద్యార్థి జన సమితి జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, నేషనలిస్టు కాంగ్రెస్ నాయకుడు పూరెళ్ల నితీష్ తదితరులు పాల్గొన్నారు.

వార్డెన్లపై చర్యలు తీసుకోవాలి

నస్పూర్, ఆగస్టు 28: లక్సెట్టిపేట, జన్నారం ఆశ్రమ పాఠశాలల్లో పని చేస్తున్న వార్డెన్లు విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తున్నందున వారిపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి జన సమితి, తెలంగాణ విద్యార్థి సమైక్య, నేషనల్ స్టూడెంట్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. విద్యార్థి జన సమితి జిల్లా అధ్యక్షుడు బచ్చలి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ వార్డెన్లుగా పని చేస్తున్న మల్లారెడ్డి, శాంతలను విధుల నుంచి తప్పించాలని కోరుతూ ఏటీడబ్ల్యూవో పురుషోత్తం, డీటీడీవో గంగారాంకు వినతి పత్రాలను ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ విద్యార్థి సమైక్య జిల్లా అధ్యక్షుడు రేగుంట క్రాంతి కుమార్, నేషనల్ స్టూడెంట్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పూరెల్ల నీతీష్ పాల్గొన్నారు.

టీజీఎంసీ బృందం తనిఖీ

భీమారం, ఆగస్టు 28: మండల కేంద్రంలో బుధవారం టీజీఎంసీ బృందం పలు క్లీనికులలో తనిఖీలు చేపట్టింది. మండల కేంద్రలోని ఎస్‌బీఐ సమీపంలోని రంజిత్ కుమార్ ఫార్మ క్లినిక్ నడుపుతూ మోతాదుకు మించి యాంటీబయోటిక్స్, నొప్పి మందులు, ఫ్లూయిడ్స్ ఇతర హైడోస్ మెడిసిన్ ఇస్తున్నారని తెలిపారు. టీజీఎంసీ కోఆప్షన్ మెంబర్ డాక్టర్ సంతోష్, డాక్టర్ అనిల్, ప్రసాద్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

హాజీపూర్, ఆగస్టు 28: మండలంలోని దొనబండ గ్రామ శివారులో ఆటో నుంచి కింద పడి తీవ్ర గాయాల పాలై బెల్లంపల్లికి చెందిన పులి మూర్తి(38) మృతిచెందినట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. బెల్లంపల్లికి చెందిన పులి మూర్తి బుధవారం తన భార్య జ్యోత్న, అతడి చిన్నాన్న సురేష్, సురేష్ భార్యతో కలిసి వేములవాడ నుంచి బెల్లంపల్లికి వెళ్తున్నారు. ఆటో దొనబండ శివారులోకి రాగానే ఆటో డ్రైవర్ సురేష్ వేగంగా అజాగ్రత్తగా నడుపుతూ ఒక్కసారిగా ఎడమవైపునకు తిప్పాడు. దీంతో వెనకాల కూర్చున్న పులి మూర్తి ఆటోలో నుంచి కింద పడడంతో గాయాలపాలయ్యాడు. వెంటనే అదే ఆటోలో మంచిర్యాల ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సాయంత్రం మృతిచెందినట్లు తెలిపారు. పులిమూర్తి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బాలికను వేధించిన బాలుడి అరెస్టు

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 28: జిల్లా కేంద్రంలోని ఓ బాలిక(17)ను ప్రేమ పేరుతో లైంగిక దాడికి పాల్పడ్డాడని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదే ప్రాంతానికి చెందిన ఓ బాలుడి(17)ని బుధవారం అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ బన్సీలాల్ తెలిపారు. బాలిక కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు అదుపులోకి తీసుకున్నా మని, విచారణ అనంతరం కోర్టులో హాజరుపర్చినట్లు సీఐ వెల్లడించారు.

చోరీ కేసులో ఒకరికి తొమ్మిది నెలలు జైలు శిక్ష

రామకృష్ణాపూర్, ఆగస్టు 28: రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఏడాదా మే 19 వ తేదీన జరిగిన చోరీ కేసులో ఒకరికి తొమ్మిది నెలలు జైలు శిక్ష విధిస్తూ మేజిస్ట్రేట్ బుధవారం తీర్పునిచ్చారు. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. క్యాతనపల్లి ఎక్స్ రోడ్ వద్ద సుర రాయలింగు ఇంటిలో దొంగతనం కేసులో మంచిర్యాలకు చెందిన నదీమ్‌కు 9 నెలల జైలు శిక్ష విధించారు. సూర రాయలింగు ఇచ్చిన ఫిర్యాదు ఎస్సై రాజశేఖర్ నమోదు చేసి సమగ్ర దర్యాప్తు చేసి నేరస్తుడిపై చార్జ్‌షీట్ వేయగా కోర్టు కానిస్టేబుల్ డి శ్రీనివాస్ సాక్షులను ప్రవేశపెట్టారు. అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ షాహీన్ సుల్తానా, మంచిర్యాల ప్రిన్సిపల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ముందు ప్రవేశపెట్టారు. మేజిస్ట్రేట్ సి సంపత్ సాక్షులను విచారించగా నేరం రుజువు కావడంతో 9 నెలలు జైలు శిక్ష విధించినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి

బెల్లంపల్లి(తాండూర్), ఆగస్టు 28: గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్ అన్నారు. తాండూర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడు తూ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని, డ్రైడే నిర్వహిం చాలన్నారు. వంద శాతం గర్భిణులను పేర్లను నమోదు చేయాలని, వంద శాతం పిల్లలకు టీకాలను వేయించాలన్నారు. మలేరియా,డెంగీ ప్రబలకుండా గ్రామాల్లో వైద్య శిబిరాలను నిర్వహించాలన్నారు. గ్రామాల్లో దోమల నివారణ, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా ఉండేలా అవగాహన కల్పించాలన్నారు. సూపర్‌వైజర్లను ఉపకేంద్రా లను పర్యవేక్షణ కోసం కేటాయించాలని ఆదేశించారు. ఆయన వెంట వైద్యాధికారి ఝాన్సీ, సిబ్బంది ఉన్నారు.

అల్ఫోర్స్ స్మార్ట్ పాఠశాలలో క్రీడా దినోత్సవం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న నరేందర్‌రెడ్డి

ఏసీసీ, ఆగస్టు 28: జిల్లా కేంద్రంలోని కాలేజీ రోడ్డు అల్ఫోర్స్ స్మార్ట్ పాఠశాలలో ముందస్తు క్రీడా దినోత్సవ వేడుకలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నరేందర్‌రెడ్డి ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. క్రీడలను ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లోని

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

» రామగుండం సీపీ శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ శ్రీనివాస్

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 28: మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో పనిచేసే పోలీస్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని రామగుండం కమిషనర్ ఆఫ్ పోలీస్ ఎం శ్రీనివాస్ అన్నారు. కమిషనరేట్ కార్యాలయంలో బుధవారం మావోయిస్టు ప్రభావిత ప్రాంత పరిధిలోని పోలీస్ స్టేషన్లలో పనిచేసే అధికారులకు టాక్టిస్, ఫీల్డ్‌కాఫ్ట్, మ్యాపింగ్‌లపై నిష్ణాతులైన ఆర్మ్‌డ్ రిజర్వుడ్ అధికారులచే శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మావోయిస్టు కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలని చెప్పారు. సరిహద్దు ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుండా వారిని నివారించాలన్నారు. ఫిజికల్ ఫిట్‌నెస్, ఆయుధ వినియోగం, అంబూష్, వెహికిల్ అంబూష్, టాక్టికల్ మూమెంట్, పోలీస్ స్టేషన్ల పరిధిలోని ప్రాంతం మ్యాప్‌పై పూర్తి అవగాహన కల్గి ఉండాలన్నారు. అవసరాన్ని బట్టి ఆపరేషన్స్ వ్యూహంలో మెళుకువలతో పరిస్థితులకు అనుగుణంగా ఎలా వ్యవహరించాలో సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్ర, ట్రాఫిక్ ఏసీపీ నరసింహులు, ఏఆర్ ఏసీపీలు ప్రతాప్, నరేంద్రపాల్గొన్నారు.

ఆరోగ్యంగా ఉంటేనే సమర్థవంతంగా విధులు

కోల్‌సిటీ, ఆగస్టు 28: ఆరోగ్యమే మహాభాగ్యమని, ఆరోగ్యంగా ఉంటేనే సమర్థవంతంగా విధులు నిర్వహించగలమని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాస్ అన్నారు. రామగుండం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం పోలీస్ కమిషనరేట్ హెడ్ క్వార్టర్స్ ఆవరణలో పోలీస్ అధికారులకు, సిబ్బందికి ఉచిత హెల్త్‌క్యాంప్‌ను నిర్వహించగా సీపీ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది నిత్యం విధి నిర్వహణలో ఉంటూ తమ ఆరోగ్యం పట్టించుకోకపోవడంతో ఎన్నో రకాల అనారోగ్యాలకు గురవుతున్నారన్నారు. ట్రాఫిక్ సిబ్బంది విధులు నిర్వహిస్తూ దుమ్ము, దూళి, వెహికల్ పొల్యూషన్‌కు ప్రభావితం కావడం జరుగుతుందన్నారు. ఆరోగ్యంపై అవగాహన ఎంతో ముఖ్యమని, అధికారులు, సిబ్బంది ఆరోగ్యం పట్ల అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని, పోలీసు దినచర్య, జీవన విధానం మిగతావారితో పూర్తి భిన్నంగా ఉంటుందని, ఇందుకు మన ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకోక తప్పదన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో వ్యాధులు ఎంతో వేగంగా విస్తరిస్తున్నాయని, వ్యాదుల బారిన పడకుండా తగిన ఆరోగ్య సూచనలు పాటిస్తే ఎంతో మంచిదన్నారు. మనం తీసుకునే అన్ని రకాల ఆహార పదార్థాల విషయంలో జాగ్రత్తగా తీసుకోవాలని సూచించారు. ప్రస్తుత సమాజంలో ఎంతో అత్యాధునిక వైద్య సదుపాయాలు అందుబాటులో కలవని 40సంవత్సరాలు పైబడిన ప్రతి ఒక్కరూ మూడు నెలలకు ఒకసారైనా మన ఆరోగ్యం కోసం డాక్టర్లను సంప్రదించి మందులు వాడే దానికంటే ముందు జాగ్రత్తలు తీసుకోవడం చాలా మంచిదని సూచించారు. వైద్య సేవలు అందించిన వైద్యులకు, లయన్స్‌క్లబ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. వైద్య శిబిరంలో కంటి పరీక్షలు, డెంటల్, ఆర్థోపెడిక్, బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ (అడ్మిన్) రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్ర, ట్రాఫిక్ ఏసీపీ నరసింహులు, ఏఆర్ ఏసీపీలు ప్రతాప్, సురేంద్ర, మంచిర్యాల ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, పెద్దపల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అనిల్, ఆర్‌ఐలు దామోదర్, మధు, శ్రీనివాస్, సంపత్, వామనమూర్తిలు, లయన్స్‌క్లబ్ అధ్యక్షులు పీ మల్లికార్జున్, జోన్ చైర్మన్ కే రాజేందర్, సెక్రటరీ ఎల్లప్ప, కోశాధికారి గోవర్ధన్‌రెడ్డి, వైద్యులు కే లక్ష్మీప్రసాద్, కె. గోపి కృష్ణ, శ్రీకాంత్, నాగిరెడ్డి, దుర్గ ప్రసాద్, మల్లికార్జున్, రామగుండం పోలీస్ కమిషనరేట్ పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు బోర్లకుంట పోచలింగం తదితరులు పాల్గొన్నారు.

కలప పట్టివేత

కోటపల్లి, ఆగస్టు 28: మండలంలోని జనగామ గ్రామ సమీపంలో ప్రాణహిత నది తీర ప్రాంతంలో నిల్వ ఉంచిన కలపను బుధవారం పట్టుకున్నట్లు రేంజ్ అధికారి సదానందం తెలిపారు. కలప తరలుతుందనే సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించగా నది తీర ప్రాంతంలో 29 టేకు దుంగలు లభించాయని చెప్పారు. వీటి విలువ ు రూ. 2 లక్షలు ఉంటుందని తెలిపారు. కలపను రేంజ్ కార్యాలయానికి తరలించినట్లు తెలిపారు. ఎఫ్‌బీవో సర్వేశ్వర్ నది తీరాన్ని సందర్శించారు. కార్యక్రమంలో డిప్యూటి రేంజర్ పాషా , బీట్ అధికారి రాజేందర్ పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణే ధ్యేయం

మందమర్రిటౌన్, ఆగస్టు 28: జాతీయ రహదారి నుంచి మొదలుకుని మందమర్రి, గోదావరి ఖని కోల్‌బెల్ట్ రోడ్డుపై ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపడుతున్నామని ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు. బుధవారం కోల్‌బెల్ట్ రోడ్డుపక్కన ఉన్న కల్వర్టులకు, డివైడర్లకు రేడియం స్టిక్కర్లను అంటించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ వాహనాలు వేగంగా కాకుండా నెమ్మదిగా నడపాలని సూచించారు. రోడ్డు నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని కోరారు.

నేతకాని సంక్షేమ సంఘం గ్రామ కమిటీ

జన్నారం, ఆగస్టు 28: చింతగూడ నేతకాని సంక్షేమ సంఘం గ్రామ కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా దుర్గం నందయ్య, అధ్యక్షుడిగా దుర్గం వినోద్, ఉపాధ్యక్షుడిగా జాడి రాజన్న, ప్రధాన కార్యదర్శిగా అల్లూరి వినోద్, కోశాధికారిగా శంకర్, సంయుక్త కార్యదర్శిగా దేవేందర్, ప్రచార కార్యదర్శిగా జాడి రాజ్‌కుమార్, కార్యవర్గసభ్యులుగా చంద్రయ్య, కిష్టయ్య, లింగం, రాజన్న, శ్రీనివాస్, గౌరవ సలహాదారులుగా లక్ష్మణ్, రాజన్న, రాజలింగు, రాజయ్యను ఎన్నుకున్నారు.

మాజీ ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

హాజీపూర్, ఆగస్టు 28: మండలంలోని రాపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆంజనేయ స్వామి ఆలయంలో బుధవారం శ్రీ అభయాంజనేయ , శివ పంచాయతన సహిత, నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు విజిత్‌కుమార్ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

'ప్రజా సమస్యలపై పోరాటం'

బెల్లంపల్లి, ఆగస్టు 28: ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ అన్నారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సెప్టెంబరు 1 నుంచి 7 వరకు పార్టీ శ్రేణులు ప్రజలకు వద్దకు వెళ్లి వారి సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి పోరాటాలు చేయాలన్నారు. సమావే శంలో మిట్టపల్లి వెంకటస్వామి, బొల్లం పూర్ణిమ, ఆడెపు రాజమౌళి, బానేష్, లక్ష్మీనారా యణ , రాజం, తిలక్, రాంచందర్, శ్రీనివాస్, శంకర్, రాజేశం పాల్గొన్నారు.

ఐకేపీ వీవోఏల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఐకేపీ వీవోఏలు

నస్పూర్, ఆగస్టు 28: ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ఐకేపీ వీవోఏలకు కనీస వేతనం రూ. 26వేలు, ఇతర సమస్యలను సత్వరమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్ ఎదుట బుధవారం తెలంగాణ ఐకేపీ వీవోఏ ఉద్యోగుల సంఘం (సీఐటీయూ) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్ కుమార్ దీపక్‌కు అందజేశారు. ఈ సందర్భంగా సంఘం గౌరవ అధ్యక్షుడు, సీఐటీయూజిల్లా ప్రధాన కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం రూ. 26వేల వేతనం అమలు చేయాలన్నారు. సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. రూ. 10 లక్షల సాధారణ బీమా, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. గ్రేడింగ్ తో సంబంధం లేకుండా ప్రతి నెల వేతనాలను విఓఏల వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. జీవో నంబరు 580 సవరించాలని, వీవోఏల మూడు నెలల రెన్యూవల్ పద్ధతిని రద్దు చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వీవోఏలకు ఒకే రకమైనా యూనిఫామ్ ఇవ్వాలన్నారు. అర్హులైనా వీవోఏలకు సీసీలుగా పదోన్నతి కల్పించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ ఐకేపీ వీవోఏల ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కుంటాల కుమార్, దుర్గం రాములు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ లింగపల్లి వెంకటేశ్, కోశాధికారి పొట్ట పోశం పాల్గొన్నారు.

● సంక్షిప్తం..

● మంచిర్యాల కలెక్టరేట్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో సెప్టెంబరు 4 నుంచి నిర్వహించే సదరం శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీవో కిషన్ ఒక ప్రటకనలో తెలిపారు. మీ సేవలో స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు. సెప్టెంబరు 4,9,20,28 తేదీల్లో శారీరక దివ్యాంగులు, 13,27 తేదీల్లో కంటి చూపు, 17,24 తేదీల్లో మూగ, చెవుడు, 27న మానసిక దివ్యాంగులకు పరీక్షలు చేయనున్నామని తెలిపారు.

● చెన్నూరు: మండలంలోని ముత్తరావుపల్లి గ్రామానికి చెందిన వెన్నపురెడ్డి సందీప్‌రెడ్డి వెటర్నరీ అసిస్టెంట్ పోస్టుకు ఎంపికయ్యాడు. 2023లో నిర్వహించిన వెటర్నరీ అసిస్టెంట్ పోస్టు పరీక్ష రాసి ఎంపికయ్యాడు.

● దండేపల్లి: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని బిగ్ హెల్ప్ ఫర్ ఎడ్యుకేషన్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ఎండి షరీఫోద్దీన్, రెబ్బనపల్లి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రాజు అన్నారు. హైదరాబాద్ చెందిన బిగ్ హెల్ప్ ఫర్ ఎడ్యుకేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని రెబ్బనపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం స్టడీ మెటీరియల్, స్టేషనరీ వస్తువులను అందజేశారు.

- మండలం కొండాపూర్‌లో భక్తాంజనేయస్వామి ఆలయ కమిటి ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి గ్రామం లో శ్రీకృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. అనంతరం అన్నదానం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

● ఏసీసీ: గౌతమ్ రాజేశ్వరి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఉచిత టైలరింగ్ శిక్షణకు దరఖాస్తులు చేసుకోవాలని సంస్థ డైరెక్టర్ సరిత బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఆసక్తి గల వారు సెప్టెంబరు ఐదో తేదీ లోగా ఓవర్ బ్రిడ్జి పక్కన కైలాసగిరి కాలనీలో దీప్తి బొటిక్ సెంటర్‌లో సంప్రదించాలని తెలిపారు. వివరాల కోసం 99895 27152లో సంప్రదించాలని సూచించారు.

● మందమర్రి టౌన్: విద్యానగర్ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల విద్యార్థులకు ప్రజా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో గొడుగులు పంపిణీ చేశారు. సంస్థ అధ్యక్షుడు షేక్ అజీమొద్దీన్ మాట్లాడుతూ వర్షాకాలంలో విద్యార్థులు తడవకుండా గొడుగులు అందజేశామని తెలిపారు కార్యక్రమంలో రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..

విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలి

వాంకిడి: విద్యార్థుల హాజరుశాతాన్ని పెంచాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి(డీఐఈవో) కల్యాణి అన్నారు. బుధవారం ప్రభుత్వజూనియర్ కళాశాలను ఆమె తనిఖీచేశారు. విద్యార్థుల హాజరుశాతాన్ని పరిశీలించారు. విద్యార్థులు వార్షిక పరీక్షల్లో ఉత్తమఫలితాలు సాధించే విధంగా విద్యాబోధనలు చేయాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు చంద్రయ్య, కిరణ్, సురేందర్, సంతోష్, రాజమౌళి, శ్రీధర్, తిరుపతి, రాందాస్‌పాల్గొన్నారు.

కోట్నాక భీంరావు జీవితం ఆదర్శప్రాయం

ఆసిఫాబాద్‌రూరల్: రాష్ట్ర మొట్టమొదటి గిరిజనశాఖ మంత్రి కోట్నాక భీంరావు రాజకీయ జీవితం అందరికీ ఆదర్శప్రాయమని రాజ్‌గోండ్ సేవాసమితి జిల్లా ఉపాధ్యక్షుడు సిడాం సూరు మాస్టర్ పేర్కొన్నారు. ఈ నెల 29న కోట్నాక భీంరావు 22వవర్ధంతిని పురస్కరించుకొని బుధవారం జిల్లాకేంద్రంలోని రాయి సెంటర్ వద్ద ఆయన మాట్లాడారు. వర్ధంతి వేడుకల్లో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రాష్ట్రస్థాయి శిక్షణలో పాల్గొన్న జిల్లా ఉద్యోగులు

ఆసిఫాబాద్‌రూరల్: రాష్ట్ర విద్యాశాఖ ఇటీవల చేసిన ఎఫ్‌ఎల్‌ఎన్,ఎల్‌ఐపీ మార్పులపై రాష్ట్ర విద్యాశిక్షణ పరిశోధన సంస్థ బుధవారం హైదరాబాద్‌లోని చెన్నారెడ్డి మానవవనరుల కేంద్రంలో నిర్వహించిన ఒకరోజు శిక్షణకు జిల్లా ఉద్యోగులు హాజరయ్యారు.

రోడ్డు సేఫ్టీ పై ఆటో డ్రైవర్‌లకు అవగాహన

ఆసిఫాబాద్‌రూరల్: పట్టణంలోని పోలీసుస్టేషన్‌లో బుధవారం ఆటో డ్రైవర్‌లకు రోడ్‌సేఫ్టీపై డీఎస్పీ సదయ్య పర్యవేక్షణలో సీఐ సతీష్ అవగాహన కల్పించారు. నూతనచట్టాలు, రోడ్డుప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు.

5 లోగా ఓటరు జాబితా పూర్తిచేయాలి

కెరమెరి: వచ్చేనెల 5లోగా ఓటరు జాబితా పూర్తి చేయాలని జడ్పీ సీఈవో లక్ష్మీనారాయణ అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులతో ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితా తప్పులు లేకుండా వార్డుల వారీగా గుర్తించి అందులోలేని ఓటర్లను గుర్తించాలన్నారు.

వసతి గృహాల్లో పరిశుభ్రత పాటించాలి

సిర్పూర్(యు): వసతిగృహాల్లో పరిశుభ్రత పాటించాలని మండలప్రత్యేకాధికారి భాస్కర్ అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని ఆయన తనిఖీచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలలో పరిశుభ్రత పాటించాలన్నారు. దోమలు వృద్ధి చెందకుండా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులకు మెనూప్రకారం భోజనవసతి కల్పించాలన్నారు.

ఆర్థిక సాయం అందజేత

లింగాపూర్: మండలకేంద్రానికి చెందిన రాథోడ్ కిషన్ కొన్నిరోజుల క్రితం మృతిచెందగా ఆయన కుటుంబ సభ్యులను బుధవారం రెహమాన్ ఫౌండేషన్ సభ్యులు పరామర్శించి ఐదువేల రూపాయలు ఆర్థికసాయం అందజేశారు.

కోళ్ల పెంపకంతో లబ్ధి పొందాలి: డీఆర్డీవో పీడీ

జైనూర్: కోళ్ల పెంపకంతో స్వయం సహాయక సంఘాలు ఆర్థికంగా లబ్ధి పొందాలని డీఆర్డీవో బానోత్ దత్తారావ్ కోరారు. మహిళలు స్వయం ఉపాధి పొందేందుకు వారికి కుట్టుమిషన్లతో ఇదివరకే శిక్షణకార్యక్రమాలు నిర్వహించామన్నారు.

ఏజెన్సీలో తీజ్ సంబరాలు

జైనూర్: ఏజెన్సీ గ్రామాల్లో గోరమాటీల తీజ్‌సంబరాలు కోలాహలంగా సాగుతున్నాయి. ఈసందర్భంగా ఆడపడుచులు తీజ్‌బుట్టలతో ప్రత్యేకఆకర్షణగా తండాల్లో నృత్యాలు చేస్తూ చూపరులకు కనువిందు చేశారు.

ఆయూష్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం

బెజ్జూరు: మండలకేంద్రంలోని ఆయుర్వేదవైద్యశాలలో బుధవారం ఆయూష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని తహసీల్దార్ భూమేశ్వర్ ప్రారంభించారు. దీర్ఘకాలికవ్యాధులతో బాధపడుతున్న రోగులకు ఆయూష్ వైద్యం అద్భుతంగా పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సతీష్‌రెడ్డి 70మంది రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

ఓటరు లిస్టు సవరణను పకడ్బందీగా చేపట్టాలి

బెజ్జూరు: పంచాయతీల వారీగా ఓటరులిస్టు సవరణను పకడ్బందీగా చేపట్టాలని డీపీవో భిక్షపతిగౌడ్ అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీఓటర్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని తెలిపారు. త్వరలో జరిగే పంచాయతీ ఎన్నికలకు ఓటరులిస్టు సిద్ధం చేయాలన్నారు.

వైద్యులు అందుబాటులో ఉండి సేవలందించాలి

● అదనపు కలెక్టర్ దీపక్ తివారి



కౌటాలలో ఆసుపత్రి ఆవరణను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

కౌటాల/చింతలమానేపల్లి, ఆగస్టు 28: ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో వైద్యులు సమయపాలన పాటిస్తూ ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని అదనపుకలెక్టర్ దీపక్ తివారి అన్నారు. బుధవారం ఆయన కౌటాల, చింతలమానేపల్లి మండలకేంద్రాల్లోని ప్రాథమికఆరోగ్యకేంద్రాలను ఆకస్మికంగా సందర్శించారు. ఆసుపత్రుల్లోని వార్డులు, రిజిస్టర్లు, మందుల నిలువలు, రికార్డులు, ఆసుపత్రి పరిసరాలను పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఆసుపత్రికివచ్చే ప్రజలకు మెరుగైనవైద్యం అందించాలన్నారు. సీజనల్‌వ్యాధుల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వ్యాధులవ్యాప్తిని నివారించేందుకు పాటించాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించాలని తెలిపారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్యసేవలపై డిప్యూటీ డీఎంహెచ్‌వో సీతారాంనాయక్, వైద్యుడు రాజ్‌కుమార్‌ను అడిగితెలుసుకున్నారు. సిబ్బంది కొరత ఉండడంతో వైద్య సేవలు అందించడంలో ఇబ్బందులు ఎదువుతున్నాయని తెలపగా సరిపడా సిబ్బంది నియామకానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం రోగులతో మాట్లాడి అందుతున్న వైద్య సేవలను తెలుసుకున్నారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో సాధారణ ప్రసవాలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఆసుపత్రిలో అవసరమైన మందుల వివరాలతో నివే దిక అందించినట్లయితే పంపిణీ చేస్తామని తెలిపారు. అనంతరం మండలకేంద్రంలోని పాతప్రాథమిక ఆరోగ్యకేంద్రం స్థలాన్ని పరిశీలించి అక్కడ ఆక్రమణలు జరగకుండా చూడాలని ఎంపీడీవోను ఆదేశించారు. ఆయనవెంట సంబంధిత శాఖాధికారులు ఉన్నారు.

విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలి

కాగజ్‌నగర్: ప్రభుత్వ హాస్టళ్లలో ఉన్న విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని అదనపు కలెక్టర్ దీపక్‌తివారి అన్నారు. బుధవారం కాగజ్‌నగర్ మండలంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యంపట్ల శ్రద్ధ తీసుకోవాలన్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పారిశుధ్యంపై కూడా అధికారులు దృష్టి సారించాలన్నారు. ఆయన వెంట జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఉపవైద్యాధికారి సీతారాంనాయక్, వైద్య సిబ్బంది ఉన్నారు.



కాగజ్‌నగర్‌లో వివరాలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్

ఇంటి నిర్మాణాన్ని అడ్డుకున్న అటవీ అధికారులు

● స్వల్ప ఉద్రిక్తత, వాగ్వాదం ● ఇరువర్గాల ఫిర్యాదు



ఇంటి వద్ద అటవీశాఖ సిబ్బంది

దహెగాం(పెంచికలపేట), ఆగస్టు 28: మండలంలోని ఎల్కపల్లి గ్రామానికిచెందిన పోలోజు రాజమౌళి ఇల్లు కట్టుకుంటుండగా బుధవారం అటవీఅధికారులు అడ్డుకున్నారు. దీంతో వివాదం రాజుకుంది. ఇరువర్గాలు స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నిర్మాణదశలో ఉన్న కట్టడాన్ని పెంచికలపేట ఎఫ్‌ఆర్వో అనీల్‌కుమార్, ఎఫ్‌ఆర్వో లక్ష్మీనారాయణ సిబ్బందితో కలిసి అడ్డుకోవడానికి వెళ్లారు. ఈక్రమంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుని స్వల్పఉద్రిక్తతకు దారి తీసింది. దీంతో బెజ్జూరు ఎఫ్‌ఆర్వో లక్ష్మీనారాయణ తనపై దాడిచేశాడని రాజమౌళి ఆరోపించారు. నిర్మాణానికి సంబంధించి భూమికి అన్నిపత్రాలు ఉన్నప్పటికీ అటవీఅధికారులు కక్షపూరితంగా నిర్మాణాన్ని అడ్డుకొని ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించాడు. పత్రాలను పరిశీలించండి అంటే నిరాకరిం చారని ఆరోపించాడు. అయితే తమను దుర్భాషలా డుతూ తమ విధులకు ఆటంకం కల్పించారని ఎఫ్‌ఆర్వో లక్ష్మీనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై ఎస్సై కొమరయ్యను సంప్రదించగా ఫిర్యాదులు అందిన మాటవాస్తవమేని విచారణ జరుపుతామని తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత



పట్టుకున్న పశువులవ్యాన్‌తో ఎస్సై ప్రశాంత్

వాంకిడి, ఆగస్టు 28: అక్రమంగా పశువులను తరలిస్తున్న వ్యాన్‌ను బుధవారం తెల్లవారు జామున పట్టుకున్నట్లు వాంకిడి ఎస్సై ప్రశాంత్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. వాంకిడి టోల్‌ప్లాజావద్ద వాహనాలు తనిఖీచేస్తుండగా అనుమతిలేకుండా కంటైనర్‌లో మహారాష్ట్ర నుంచి హైదరాబాద్‌కు విక్రయించేందుకు వెళ్తున్న 14పశువులను పట్టుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు వ్యాపారి అబ్దుల్‌అజీజ్, మీర్జా ముజాహిద్,షేక్ జాహీద్‌పై కేసునమోదు చేసి పశువులను కాగజ్‌నగర్‌గోశాలకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

నేడు పీఏసీఎస్ ఎదుట ధర్నా

బెజ్జూరు, ఆగస్టు 28: మండలకేంద్రంలోని పీఏసీఎస్‌లో జరుగుతున్న అవినీతిఅక్రమాలను నిరసిస్తూ గురువారం పీఏసీఎస్ కార్యాలయం ఎదుట ధర్నా చేపడతామని బీజేపీ నాయకుడు పాల్వాయి సుధాకర్ తెలిపారు. బెజ్జూరు పీఏసీఎస్‌లో జరిగిన అవినీతి, అక్రమాలపై అధికారులు విచారణ జరిపించాలని డిమాండ్‌చేస్తూ ధర్నా చేపడుతునట్లు తెలిపారు.

గంజాయి సాగుచేసిన వ్యక్తిపై కేసు నమోదు

కెరమెరి, ఆగస్టు 28: గంజాయి సాగు చేస్తున్నాడన్న సమాచారం మేరకు మండలంలోని దేవుడ్‌పెల్లి గ్రామానికి చెందిన తాకసాండే పోచిరాం అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ విజయ్ తెలిపారు. 30 మొక్కల్ని స్వాధీనం చేసుకున్నామని దాని విలువ సుమారు 3లక్షల రుపాయల వరకు ఉంటుందని తెలిపారు. ఈ మేరకు పోచిరాం పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

బాలుడి మృతదేహం లభ్యం

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 27: మండలంలోని బొందగూడ గ్రామానికి చెందిన జాదవ్ సగ్రీబాయి, తన మూడేళ్ల కుమారుడు అశ్విన్ సోమవారం సాయంత్రం ప్రమాదవశాతు వట్టివాగు కాలువలో పడిపోయారు. సగ్రీబాయి మృతిచెందగా బాలుడు గల్లంతయ్యాడు. అశ్విన్ ఆచూకీకోసం గాలించినప్పటికీ లభ్యంకాలేదు.దీంతో బుధవారం గాలించగా రౌటసంకెపల్లి కాలనీ సమీపంలోని వట్టివాగుకాలువలో బాలుడి మృతదేహం లభ్యమైనట్లు సీఐ సతీష్ తెలిపారు.

ఆర్టీసీ బస్సుకు తప్పిన ప్రమాదం

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 28: ఆసిఫాబాద్ ఆర్టీసీ డిపోకు చెందిన సూపర్‌లగ్జరీ బస్సుకు పెనుప్రమాదం తప్పింది. బుధవారం ఉదయం హైదరాబాద్ నుంచి ఆసిఫా బాద్‌కు వస్తుండగా సిద్దిపేట సమీపంలో టూవీలర్‌ని తప్పించబోయి డీవైడర్‌ను ఢీకొట్టాడు. బస్సులో 36మంది ప్రయాణికులు ఉన్నారు. ప్రయాణికులకు ఎవరికి గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

గిరిజన గ్రామాల్లో వైద్యశిబిరం



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ వినోద్‌కుమార్

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 28: మండలంలోని మోవాడ, బల్హాన్‌పూర్, చింతగూడ గ్రామాల్లో డాక్టర్ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీచేశారు. మలేరియా, డెంగ్యు, చికున్ గున్యాలపై అవగాహన కల్పించారు. పరిసరాలు, వ్యక్తిగతపరిశుభ్ర పాటించా లన్నారు. 15మందిని నుంచి రక్తనమునాలు సేకరించి 42మందికి సాధారణ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ కీర్తి, నజమస్, సరిత, భీంరావు, పరశురాం, సూర్యకల, వసంత, రాధ పాల్గొన్నారు.

వాంకిడి: మండలంలోని ఖైరిటిగ్రామంలో బుధవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా జ్వరాలతో బాధపడుతున్న నలుగురి రక్తనమునాలు సేకరించారు. అనంతరం ఇంటింటికి దోమలమందు పిచికారి చేశారు. కార్యక్రమంలో హెచ్ఈవో రవిదాస్, పీహెచ్ఎన్ కిష్టయ్య, హెచ్ఎస్ అనసూయ, ఏఎన్ఎం సునంద, ఆశావర్కర్ భీమక్క పాల్గొన్నారు.

ఆన్‌లైన్ బెట్టింగ్‌లో నష్టపోయి ఒకరి ఆత్మహత్య

జైనూర్, ఆగస్టు 28: మండలకేంద్రంలో ఓ వ్యక్తి ఆన్‌లైన్ బెట్టింగ్‌లో సర్వం కోల్పోయి అప్పులపాలై ఆత్మహత్యకు చేసుకున్నాడు. ఇచ్చోడ మండలంలోని నర్సాపూర్‌కు చెందిన కిరణ్(26) ఐదు సంవత్సరాల నుండి వ్యాపారిత్యా కెరమెరి మండలంలో స్థిరపడ్డాడు. ఈనెల21న కిరణ్ బండి ఫైనాన్స్ డబ్బులు కట్టి వస్తానని చెప్పి ఇంటి నుంచి బయలు దేరాడు. అదే రోజు సాయంత్రం కాసు పటేల్‌గూడ సమీపంలో పురుగు మందు తాగి ఆ విషయాన్ని భార్య శీతల్‌కు ఫోన్ చేసి చెప్పాడు. దీంతో శీతల్ కుటుంబసభ్యులతో సంఘటన స్థలానికి చెరుకుని బాధితుడిని స్థానిక ఆసుపత్రికి తరలించగా అక్కడి నుంచి వైద్యుల సూచన మేరకు ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాగర్ తెలిపారు.

పాఠశాలలను తెరిపించాలి

తిర్యాణి, ఆగస్టు 28: మండలంలో ఉపాధ్యాయులు లేక మూతపడ్డ పాఠశాలలను తెరిపించాలని బుధవారం తుడుందెబ్బ జిల్లాకోకన్వీనర్ గేడెం సుభాష్ ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తాకు వినతిపత్రం అందజేశారు. మండలంలోని రొంపల్లి కాంప్లెక్స్ పరిధిలో అర్జున్‌లొద్ది, మాణిక్యాపూర్, పంగిడిమాదర కాంప్లెక్స్ పరిధిలో బుర్సుగూడ, వాడిగూడ, జెండాగూడ, గోవెన, పుస్లుమ్మి పాఠశాలలు మూత పడ్డాయని, దీంతోవిద్యార్థులు చదువుకు దూరమై వ్యవసాయపనులు, మేకలు కాస్తున్నారన్నారు. వెంటనే పాఠశాలలు తెరిపించాలని కోరారు.

కలుపు..కలవరం


చింతలమానేపల్లిలో పత్తి పంటలో కలుపు తీస్తున్న కూలీలు

- ముసురు వర్షాలతో కదలని అరక, ఏపుగా పెరుగుతున్న కలుపు
- మొక్కల పెరుగుదలపై అధిక తేమ ప్రభావం
- అయోమయంలో పత్తి రైతులు

ఆసిఫాబాద్, ఆగస్టు 28: జిల్లాలో అత్యధికంగా సాగయ్యే పంటలలో పత్తిదే మొదటిస్థానం. అలాంటి పంటకు ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలు గండంగా మారాయి. పత్తి చేలల్లో నీళ్ల నిండి మొక్కలు ఎర్రగా మారుతున్నాయి. కొన్నిచోట్ల విపరీతంగా గడ్డి పెరిగిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలోని 15మండలాల్లో సుమారు 3.5లక్షల ఎకరాలలో పత్తి సాగవు తోంది. ఈ ఏడాది సీజన్ ఆరంభంలో వర్షాలు కురవకపోవడంతో రైతులు ఆందోళన చెందారు. విత్తిన విత్తనాలు చెడిపోవడంతో మళ్లీ విత్తాల్సిన పరిస్థితులు ఉత్పన్నమయ్యాయి. ఆ తరువాత కురిసిన వర్షాలతో మొక్కలు మొలకెత్తడంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. పత్తి పంటలో అరకలు తోలేందుకు రైతులు సిద్ధమవుతున్న తరుణంలో ముసురువానలు ముంచెత్తాయి. వర్షాలతో పత్తిచేలల్లో అరకలు తిరిగే అవకాశం లేకుండా పోయింది. కూలీలతో కలుపు తీసేందుకు చూస్తుంటే కూలీల కొరత వెంటాడుతున్నది. దీంతో పత్తి పంటను కలుపు మొక్కలు కమ్మేస్తున్నాయి. కలుపు తీసేందుకు కూలీలు దొరక్క పోవడంతో వేలల్లో ఖర్చుచేసి గడ్డి మందును పిచికారి చేయాల్సి వస్తోంది. పరిస్థితి ఇలాగే ఉంటే సమస్య మరింత తీవ్రమవుతుందని, దిగుబడిపై ప్రభావం పడుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.


పత్తి చేనులో గడ్డిమందు పిచికారి చేస్తున్న రైతు

నేలలో అధిక తేమ..

విస్తారమైన వర్షాలతో పంట భూముల్లో తేమ శాతం పెరుగుతోంది. ప్రస్తుతం సాగులో ఉన్న పత్తి తదితర పంటలు దెబ్బతింటున్నాయి. చాలా ప్రాంతాల్లో పంట చేనులు నీటిలో మునిగి తెగుళ్ల బారిన పడుతున్నాయి. ముసురువానల మూలంగా భూములు తేమ ఆరకపోవడంతో మొక్కల ఎదుగుదలపై ప్రభావం పడుతోంది. గతేడాది సైతం ఇదేస్థాయిలో కురిసిన వర్షాలతో పత్తిలో ఎదుగుదల లోపించి దిగుబడిపై తీవ్రప్రభావం పడింది.

వేధిస్తున్న కూలీల కొరత..

రైతులకు కలుపుతీత సవాలుగా మారింది. కలుపు తీసేందుకు కూలీల కొరత వేధిస్తోంది. గ్రామాల్లో రైతులు కలుపు తీసేందుకు కూలీలకు రోజుకి రూ. 300నుంచి 500 చెల్లిస్తున్నా సరిపడ కూలీలు దొరకడం లేదు. కలుపు తీయడం ఆలస్యమవుతుండడంతో ఏపుగా పెరుగుతున్న కలుపుతో పంట ఎదుగుదలపై తీవ్ర ప్రభావం పడతోంది. గడ్డిమందు పిచికారి చేయాలంటే వేలల్లో ఖర్చు చేయాల్సిన పరిస్థితులు ఉన్నాయి. దీంతో ఇటు కూలీలు దొరకక అటు గడ్డి మందు పిచికారి చేయలేక రైతులు ఆందోళనకు చెందుతున్నారు.

దిగుబడిపై తీవ్రప్రభావం..: నారాయణ, రైతు



అధిక వర్షాలతో పత్తిపంట దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతోంది. గతేడాది కూడా అధిక వర్షాలతో దిగుబడి తగ్గింది. ఈ ఏడాది కూడా వర్షాలతో పంట చేలల్లో నీరు నిలిచి మొక్కలు తెగుళ్ల బారినపడుతున్నాయి. పత్తిచేలలో కలుపు మొక్కల తీవ్రత పెరిగింది. కలుపు తీత చేద్దామంటే కూలీల కొరతతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

కలెక్టరేట్ ఎదుట సమగ్ర శిక్ష ఉద్యోగుల ధర్నా


కలెక్టట్ ఎదుట ధర్నా చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

ఆసిఫాబాద్ రూరల్, ఆగస్టు 28: సమస్యలను పరిష్కరించాలని సమగ్ర శిక్ష ఉద్యోగులు బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అంతకుముందు పట్టణంలోని శివాజీ విగ్రహం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ అధికారంలోకి వస్తే వందరోజుల్లో మిమ్మల్ని పిలిపించి చాయ్‌తాగే లోపు మీసమస్యలు పరిష్కరిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారన్నారు. కానీ అధికారంలో వచ్చిన తరువాత పట్టించుకోవడం లేదన్నారు. ఉద్యోగులకు ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు, టీపీఆర్టీయూ జిల్లాఅధ్యక్షుడు శ్యాంసుందర్, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి ఇందురావ్ మద్దతు తెలిపారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష ఉద్యోగుల సంఘంనాయకులు మోహన్, తుకారాం, నగేష్, సీఆర్పీలు దేవేందర్, మహేశ్వర, సత్యనారాయణ, రాజేష్, సంతోష్, సోను, సందీప్, రాము, సుభాష్‌పాల్గొన్నారు.

ఐకేపీ వీవోఏల ధర్నా..


ధర్నా చేస్తున్న వీవోఏలు

ఆసిఫాబాద్: సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట ఐకేపీలో పనిచేస్తున్న వీవోఏలు ధర్నా చేపట్టారు. అంతకు ముందు పట్టణంలోని ప్రధానవీధులగుండా ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్‌కు చేరుకున్నారు. వీవోఏలకు కనీసవేతనం రూ.26వేలు చెల్లించాలని, గ్రేడింగ్‌తో సంబంధం లేకుండా వేతనాలు చెల్లించాలని, సెర్ప్‌ఉద్యోగులుగా గుర్తించాలని, ఉద్యోగభద్రత కల్పించాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో వీవోఏల నాయ కులు రమ, జ్యోతి, ఆనంద్, పయాం,స్వప్న, జయంత్, సంతోష్ పాల్గొన్నారు.

సమస్యలు చెబితే బెదిరిస్తున్నారు: నర్సింగ్ సిబ్బంది


మాట్లాడుతున్న నర్సింగ్ సిబ్బంది

ఆసిఫాబాద్‌రూరల్, ఆగస్టు 28: తమ సమస్యలను ఉన్నతాధికారులకు తెలిపితే బెదిరిస్తున్నారని నర్సింగ్ సిబ్బందిఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం జిల్లాఆసుపత్రి ఎదుట నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు ఏడాదికి 35క్యాజువల్ లీవ్‌లు ఉన్నప్పటికీ వాటిని వినియోగించుకోలేక పోతున్నామన్నారు. ఎవరైన లీవ్‌పెడితే వేతనం నుంచి కోత విధిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఇతర జిల్లాలో లీవ్‌లు ఇస్తున్నప్పటికీ జిల్లాలో లీవ్‌లు ఇవ్వకపోవడమేంటని ప్రశ్నించారు. తాము జిల్లా ఆసుపత్రిలో డ్యూటీచేసిన తర్వాత మళ్లీమెడికల్‌కళాశాలలో డ్యూటీ వేస్తున్నారన్నారు. ఆసుపత్రి నుంచి మెడికల్‌కళాశాల వరకు వెళ్లడానికి తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వారు తెలిపారు. అధికారులు తమను తీవ్రఒత్తిడికి గురిచేస్తున్నట్లు తెలిపారు. ఏడాదికి 35క్యాజువల్ లీవ్‌లను ఇంప్లిమెంట్ చేయాలని, వేతనాలను అప వద్దని, కట్‌చేసిన వేతనాలను తిరిగి ఇవ్వాలని, బయోమెట్రిక్ చెడిపోతే మాన్యువల్‌గా సంతకాలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఆసుపత్రిలో వాష్‌రూంలు లేక తీవ్రఇబ్బందులకు గురవుతున్నామన్నారు. అలాగే మంచినీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. అంతకుముందు జిల్లా కేంద్రంలోని ఆసుపత్రిలో పనిచేస్తున్న స్టాఫ్‌నర్సు రమాదేవి మంగళవారం అర్ధరాత్రి మృతి చెందిన నేపథ్యంలో ఆసుపత్రి ఎదుట నర్సింగ్‌సిబ్బంది రెండునిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో నర్సింగ్ సిబ్బంది శ్రీలక్ష్మి, ఆసియా, జీవిత, పర్వీన్, సౌజన్య, నస్రీన్, శైలజ, స్వర్ణలత, షఫీఉద్దీన్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గణేష్ నవరాత్రులను ప్రశాంతంగా జరుపుకోవాలి: ఎస్పీ

ఆసిఫాబాద్,ఆగస్టు 28: వినాయకచవితిని ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్పీ డీవీశ్రీనివాస్ అన్నారు. బుధవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో గణేష్ మండపాలను ఏర్పాటు చేయదల్చిన వారు ముందుగా పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. నిర్వాహకులు కమిటీ ఏర్పాటు చేసుకోవాలని, అన్నికార్యకలాపాలకు పూర్తిబాధ్యత వహించాలన్నారు. మండపాల చుట్టూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు.

రోడ్డుపైనే లారీల పార్కింగ్

- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు


రోడ్డుపైనే నిలిపిన లారీలు

కాగజ్‌నగర్, ఆగస్టు 28: కాగజ్‌నగర్ ఎస్పీఎంకు కర్రలోడ్‌తో వచ్చిన లారీలు రోడ్డుపైనే నిలిపేస్తుండడటంతో పట్టణవాసులు ఇబ్బందులు పడుతున్నారు. అసలే ఇరుకు రోడ్లు.. ఆపై లారీల పార్కింగ్‌తో తీవ్ర ఇబ్బందిగా ఉందని పట్టణవాసులు పేర్కొంటున్నారు. రాజీవ్‌గాంధీ చౌరస్తా నుంచి లారీచౌరస్తా, లారీ చౌరస్తా నుంచి బజరంగ్ చౌరస్తా వెళ్లేమార్గంలో రోడ్డుపైనే లారీలను నిలిచి ఉంటున్నాయి. ఈ మార్గంలోనే పాఠశాలలుండటంతో విద్యార్థులు ఇంటికి చేరే వరకు తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంటోంది. ఇప్పటికైనా పోలీసులు, అధికారులు స్పందించి లారీలను రోడ్డుపైనిలపకుండా చూడాలని ప్రజలుకోరుతున్నారు.

వైద్యకళాశాల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి: కలెక్టర్


వైద్య కళాశాలను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, ఆగస్టు 28: ప్రభుత్వ వైద్యకళాశాల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. బుధవారం ప్రభుత్వకళాశాల నిర్మాణ పనులను వైద్యఆరోగ్యశాఖాధికారి తుకారాంబట్, పర్యవేక్షకుడు చెన్న కేశవులుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువతుల వసతిగృహనికి సంబంధించి పూర్తి వసతులు కల్పించాలన్నారు. 100మంది మహిళా విద్యార్థినులకు గదులు, మూత్రశాలలు, ఇతర సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. భవనంలోని అన్నిఅంతస్తులలో పూర్తిస్థాయిలో సౌకర్యాలు ఉండేలా పర్యవేక్షించాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. విద్యార్థినుల సంరక్షణలో భాగంగా అనుమతి లేని వారు ఎవరూ లోనికి రాకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్య నభ్యసించే మహిళా వైద్యవిద్యార్థినులకు సరిపడా మౌలిక వసతులు ఏర్పాటు చేయాలన్నారు. వైద్యకళాశాలకు సంబంధించిన తరగతి గదులు, ప్రయోగశాల, ఇతర అన్ని ఏర్పాట్లు వేగంగా చేయాలని ఆదేశించారు.

విద్యా ప్రమాణాలను మెరుగుపర్చాలి..

విద్యాప్రమాణాలను మెరుగు పరిచే విధంగా కృషిచేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా విద్యాశాఖాధికారి అశోక్‌తో కలిసి అన్నిప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్య పాఠశాలలు, కళాశాలల ప్రతినిధులతో విద్యాప్రమాణాలు పెంపొందించడంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు గుణాత్మక విద్యనందిస్తూ విద్యాప్రమాణాలను మెరుగుపరిచే విధంగా విద్యాసంస్థలు కృషిచేయాలన్నారు. యుడైస్2024-25 విద్యాసంవత్సరంలో నైతిక విలువలతోకూడిన విద్యాబోధనలు చేస్తూ విద్యాప్రమానాలు మెరుగుపరిచిజిల్లాను మంచి స్థానంలో ఉంచేలా సమష్టిగా పనిచేయాలన్నారు. పాఠశాలల భద్రతపై చర్యలు తీసుకోవాలని, మౌలికవసతులు కల్పించాలని, ప్రతి అంశంలోని వివరాలు నమోదు చేయాలని తెలిపారు. జిల్లాలో 1200ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు ఉన్నాయని అన్ని విద్యాసంస్థలు పూర్తివివరాలతో నివేదిక రూపొందించాలన్నారు.

అమ్మకానికి సిద్ధంగా గణేష్ విగ్రహాలు


అమ్మకానికి సిద్ధంగా ఉంచిన గణేష్ విగ్రహాలు

కాగజ్‌నగర్, ఆగస్టు 28: వచ్చేనెల7న జరిగే వినాయకచవితి కోసం పట్టణంలో వివిధ ప్రాంతాల్లో విగ్రహాలను అమ్మకానికి సిద్ధంగా ఉంచారు. రాజీవ్ గాంధీచౌరస్తా, మార్కెట్‌ఏరియా, ఇండస్ట్రియల్ ఏరియాల్లో వివిధ దుకాణాలను ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలో వివిధ మండలాల్లో నెలకొల్పే విగ్రహాలు ఇక్కడినుంచే తీసుకెళ్లటంతో భారీ మొత్తంలో విగ్రహాలను ఏర్పాటు చేశారు. వీటితో పాటు గణేష్ మండపాలు ఏర్పాటుకు అవసరమైన విద్యుత్ దీపాలు, అలంకరణ వస్తువులను కూడా మార్కెట్లో అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయి.

తెరుచుకున్న పాఠశాలలు

- ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

కౌటాల, ఆగస్టు 28: మండలంలో పలు పాఠశాలలు కొన్ని రోజులుగా ఉపాధ్యాయులు లేక మూతపడడంతో గత సోమవారం 'ఆంధ్రజ్యోతి' జిల్లా అనుబంధంలో 'మూతపడ్డ పాఠశాలలు' అని వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు బుధవారం అధికారులు పాఠశాలలు తెరిపించారు. వారం రోజులుగా పాఠశాలలకు ఉపా ధ్యాయులు లేకపోవడంతో విద్యార్థులు పాఠశాలకు వెళ్లి ఆటలు ఆడుకుని తిరిగిఇంటికి వస్తుండడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. ఈ విషయమై 'ఆంధ్రజ్యోతి' జిల్లా అనుబంధంలో వార్తలు రావడంతో అధికారులు స్పందించి ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను సర్దుబాటు చేశారు. పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులను నియమించాలని, లేదా సీఆర్టీలను నియమించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఇదిలాఉండగా ఆశ్రమపాఠశాలల ఉపాధ్యాయులను సర్దుబాటు చేయడంతో ఆయాపాఠశాలల విద్యార్థులకు అన్యాయం జరుగుతుందని పేర్కొంటున్నారు.

కవితకు బెయిల్‌పై సంబరాలు


స్వీట్లు పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కాగజ్‌నగర్/రెబ్బెన, ఆగస్టు 28: ఢిల్లీ లిక్కర్ స్కాంలో కేసులో బీఆర్ఎస్ నాయకురాలు, ఎమ్మెల్సీ కవితకు సుప్రీం కోర్టు బెయిల్ మంజూరు చేయటంతో బుధవారం రెబ్బెన, కాగజ్‌నగర్‌లో బీఆర్ఎస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్వీట్లు పంపిణీచేశారు. అనంతరం టపాసులు పేల్చారు. రెబ్బెనలో జరిగిన కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శ్రీధర్, దుర్గారావు, అశోక్,అప్పు, కాగజ్‌నగర్‌లో బీఆర్ఎస్ సిర్పూరు నియోజకవర్గ ఇన్‌చార్జీ లెండుగురే శ్యాంరావు, సలీం, ముస్తాఫీజ్, మినాజ్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రవేశాలకు నోటిఫికేషన్‌జారీ

కాగజ్‌నగర్ టౌన్, ఆగస్టు 28: అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో 2024-25సంవత్సరానికి గానూ ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ అయినట్లు ఎస్‌కేఈ డిగ్రీ కళాశాల కో-ఆర్డినేటర్ దత్తాత్రేయ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ తత్సమాన పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులు బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో చేరేందుకు ఆన్‌లైన్ ద్వారా ఈనెల 31లోగా దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. సంబంధిత ఫీజు కూడా ఆన్‌లైన్ ద్వారా చెల్లించాల్సి ఉంటుందన్నారు. అలాగే రెండు సెట్ల జిరాక్స్ కాపీలు, పాస్‌ఫొటోతోపాటు ఆన్‌లైన్ హార్డ్ కాపీ సమర్పించాలన్నారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికేట్లను కళాశాలలో వెరిఫికేషన్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 98663 98678 నంబర్‌లో సంప్రదించాలని వివరించారు.

నీటికుంటలో పడి మహిళ మృతి

చింతలమానేపల్లి, ఆగస్టు 28: కూలి పనులకు వెళ్తున్న క్రమంలో ఫిట్స్‌రాగా నీటికుంటలో పడి చింతలమానేపల్లి గ్రామానికి చెందిన బంటు రుకుంబాయి(50) మృతిచెందింది. ఎస్సై నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. చింతలమానేపల్లి గ్రామానికి చెందిన రుకుంబాయి గ్రామసమీపంలో వ్యవసాయపనికి వెళ్తోంది. ఈ క్రమంలో మార్గ మధ్యలో ఒక్కసారిగా ఫిట్స్ రాగా ప్రమాదవశాత్తు నీటికుంటలో పడింది. కూలికి వస్తానని ఇంకా రాకపోవడంతో రుకుంబాయి కోసం భర్త చంద్రయ్య వెతకగా దారిలోఉన్న నీటికుంటలో మృతిచెంది ఉండ డాన్ని గమనించాడు. అనంతరం పోలీసులకు సమా చారం అందించగా ఎస్సై నరేష్ సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతురాలిభర్త చంద్రయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.



కార్మిక సమస్యల పరిష్కారమే ధ్యేయం

మందమర్రిటౌన్, ఆగస్టు 28: కార్మికుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకువెళ్తామని, యాజమాన్యం సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ ఏరియా బ్రాంచ్‌కార్యదర్శి వెంకటస్వామి ,అల్లి రాజేందర్ పేర్కొన్నారు. బుధవారం ఏరియా వర్క్‌షాపులో నిర్వహించిన గేట్‌మీటింగ్‌లో వారు మాట్లాడారు. సింగరేణిలో గత సంవత్సరం కార్మిక గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించగా గెలిచిన సంఘానికి ఇంత వరకు గుర్తింపుపత్రం ఇవ్వకపోవడంతో కార్మికుల సమస్యలు పేరుకు పోతున్నాయన్నారు. గెలిచిన సంఘం ఏఐటీయూసీకి గుర్తింపు పత్రం వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. 45 రోజులకే గుర్తింపు పత్రం ఇవ్వాల్సి ఉండగా ఇవ్వకపోవడంతో మళ్లీ ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్మికులహక్కుల సాధనకోసం సీఐటీయూ ముందుండి పోరాటాలు చేస్తుందన్నారు. నాయకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ఏఐటీయూసీ విఫలం

శ్రీరాంపూర్, ఆగస్టు 28: సమస్యల పరిష్కారంలో ఏఐటీయూసీ విఫలమైందని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు కస్తూరి చంద్రశేఖర్, డివిజన్ నాయకుడు తోడే సుధాకర్ అన్నారు. సింగరేణివ్యాప్తంగా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోరుతూ ఎస్‌ఆర్పీ-1 గనిపై కార్మికుల సంతకాలు సేకరించి మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, బొగ్గు బ్లాకుల వేలంను రద్దు చేసి సింగరేణికి వాటిని కేటాయించాలని, లాభాల వాటాను వెంటనే ప్రకటించి 35శాతం అందించాలని, తదితర డిమాండ్లు నెరవేర్చాలని కోరారు. మెజార్టీ సాధించిన కార్మిక సంఘానికి రెండేళ్ల కాలపరిమితితో కూడిన గుర్తింపు పత్రం ఇవ్వాలని, లేనిపక్షంలో అప్పటివరకు అన్ని సంఘాలతో స్ట్రక్చర్ సమావేశాలు నిర్వహించి, సమస్యలు వెంటనే ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు.

ఓసీపీలకు అనుమతులు ఇవ్వాలి

శ్రీరాంపూర్, ఆగస్టు 28: వీకే-7,రొంపేడుఓసీపీలకుస్టేజ్-1 అనుమతులు ఇవ్వాలని సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కేంద్ర బొగ్గుగనులశాఖ మంత్రి కిషన్‌రెడ్డి, ఫారెస్ట్ అడ్వైజరీ కమిటీకి ఫాక్స్ ద్వారా వినతిపత్రం పంపినట్లు శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు డేగల ప్రవీణ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈఎంవోఏఎఫ్ సమావేశం బుధవారం ఢిల్లీలో జరుగుతున్న నేపథ్యంలో ఈ లేఖను తమ సంఘం ప్రధానకార్యదర్శి అంతోటి నాగేశ్వర్ రావు పంపించారని ఆయన పేర్కొన్నారు. అనుమతులు సులభతరం చేసి గనులు త్వరగా ప్రారంభమయ్యేలా చూడాలని కోరినట్లు వివరించారు.

ఉత్తమ క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించాలి


పోటీలను ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి జీఎం

శ్రీరాంపూర్, ఆగస్టు 28: క్రీడాకారులు పోటీల్లో ఉత్తమ నైపుణ్యాన్ని ప్రదర్శించాలని ఇన్‌చార్జి జీఎం టి శ్రీనివాస్ అన్నారు. వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం వార్షిక క్రీడలు ప్రారంభమయ్యాయి. మొదటిరోజు వాలీబాల్ పోటీలను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. క్రీడలు శారీరక దృఢత్వానికి, ఆరోగ్యానికి దోహదం చేస్తాయని అన్నారు. సింగరేణిఉద్యోగులు తమ విధులను నిర్వర్తిస్తూనే క్రీడల్లో ఆసక్తి చూపడం సంతోషంగా ఉందన్నారు. ఏరియా క్రీడల్లో ఉత్తమ ప్రతిభచూపి కంపెనీ, కోల్ ఇండియాస్థాయిలో పతకాలు సాధించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎస్‌వోటు జీఎం ఎన్ సత్యనారాయణ, ఏఐటీయూసీ బ్రాంచ్‌కార్యదర్శి బాజీసైదా, అధికారుల సంఘం ఏరియా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, డీజీఎం(పర్సనల్) పి అరవిందరావు, స్పోర్ట్స్ గౌరవ కార్యదర్శి పాల్ సృజన్, తదితరులు పాల్గొన్నారు.

డబ్ల్యూపీఎస్ బెల్లంపల్లి ఏరియా కార్యవర్గం

రెబ్బెన, ఆగస్టు 28: వర్క్ పీపుల్స్ అండ్ స్పోర్ట్స్ బెల్లంపల్లి ఏరియా కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. 2024 సంవత్సరానికి గాను వార్షిక క్రీడల నిర్వహణలో భాగంగా ఈ కార్యవర్గాన్ని ఎంపిక చేశామన్నారు. ఏరియా ఉపాధ్యక్షుడిగా ఎ రాజమల్లు, చీఫ్ కోఆర్డినేటర్‌గా రెడ్డిమల్ల తిరుపతి, హానరబుల్ సెక్రెటరీగా ప్రశాంత్, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా సీహెచ్ ఆశోక్, కోఆర్డినేటర్‌గా కిరణ్ బాబుతో పాటు జనరల్ క్యాప్టెన్‌గా చంద్రకుమార్, ఇండోర్ క్యాప్టన్‌గా ఎం వెంకటేశ్వర్లు, కల్చరల్ మీట్ క్యాప్టన్‌గా రమేష్, ఫుట్‌బాల్ క్యాప్టన్‌గా ఎ.నరేష్, క్రికెట్‌క్యాప్టెన్‌గా ఎం.అన్వేష్, హాకీ క్యాప్టెన్‌గా సీహెచ్ మల్లేష్, లాంగ్ టెన్నిస్‌క్యాప్టెన్‌గా జిమురళీకృష్ణ, వాలీబాలీ క్యాప్టెన్‌గా జ్ఞానదీప్, కబడ్డీ క్యాప్టెన్‌గా ప్రవీన్‌కుమార్, అథ్లెటిక్‌క్యాప్టెన్‌గా కిరణ్, టేబుల్‌టెన్నిస్‌క్యాప్టెన్‌గా ఎం.డి. చాంద్‌పాషా, షటిల్ బ్యాడ్మింటన్‌గా ఎస్.కె. అంకుస్, బాడి బిల్డింగ్ క్యాప్టెన్‌గా జె.మురహరిరావు, బాలీబ్యాడ్మింటన్‌క్యాప్టెన్‌గా మహేందర్, బాస్కెట్ బాల్ క్యాప్టెన్‌గా ఐ.కుమార్, స్విమ్మింగ్ క్యాప్టెన్‌గా ఎం.శ్రీనివాస్, ఉమెన్స్ రిప్రెంజెంటెటివ్‌గా ఎస్.అనురాధను ఎంపిక చేశామన్నారు.

వేతనాలు చెల్లించాలని సులభ్ కార్మికుల ధర్నా

మందమర్రి టౌన్, ఆగస్టు 28: వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ బెల్లంపల్లి సులభ్ కాంట్రాక్టు కార్మికులు స్థానిక సివిల్ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. అంతకు ముందు జాతీయ రహదారి మీదుగా కార్యాలయంవరకు ర్యాలీచేశారు. ఈ సందర్భంగా ధర్నాలోపాల్గొన్న వారిని ఉద్దేశించి ఐఎఫ్‌టీయూ బెల్లంపల్లి రీజియన్ అధ్యక్షుడు జాఫర్ మాట్లాడారు. సులభ్ సూపర్వైజర్ రాజేష్ నెలనెల వేతనాలు సక్రమంగా చెల్లించడం లేదని ఆరోపించారు.త్వరగా వేతనాలు చెల్లించకుంటే ఆందోళనలు కొనసాగిస్తామని ఆయన హెచ్చరించారు. దీనిపై అధికారులు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

జీఎంను కలిసిన మాజీవిప్ నల్లాల ఓదెలు

మందమర్రి టౌన్, ఆగస్టు 28: మందమర్రి జీఎంను మాజీవిప్, కాంగ్రెస్‌నాయకుడు నల్లాల ఓదెలు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. ఏరియాను అభివృద్ధి పథంలో నడపాలని, అందుకు తమ సహకారం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో కాంపెల్లి సమ్మయ్య, మిట్టసూర్యనారాయణ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికే గనుల సందర్శన

జైపూర్, ఆగస్టు 28: సింగరేణిలో పనిచేస్తున్న కార్మికులసమస్యల పరిష్కారానికే గనులను సందర్శిస్తున్నామని గుర్తింపుసంఘం ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధానకార్యదర్శి ముస్కె సమ్మయ్య పేర్కొన్నారు. బుధవారం ఐకే1ఏ గనిని సందర్శించి కార్మికులను కలిసి వారి సమస్యలను అడిగితెలుసుకున్నారు. గని ఉన్నతాధికారులతోమాట్లాడి కార్మికుల సమస్యలను పరిష్కరిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్రీరాంపూర్ బ్రాంచ్‌కార్యదర్శి ఎస్‌కె బాజీసైదా, పిట్‌కార్యదర్శులు నవీన్‌రెడ్డి, శ్రీకాంత్, బాలకృష్ణ, అఫ్రోజ్‌ఖాన్, నాయకులు సురేష్, దేవేందర్, వెంకటేష్, రాజేందర్, రాజ్‌కుమార్, మనోహర్, ఈశ్వర్ పాల్గొన్నారు.

కన్వేయన్స్ డ్రైవర్ల వేతన సమస్య పరిష్కరించాలి

శ్రీరాంపూర్, ఆగస్టు 28: కన్వేయన్స్ డ్రైవర్ల వేతన సమస్యను పరిష్కరించాలని సింగరేణి కాంట్రాక్టు కార్మికులసంఘం(సీఐటీయూ) రాష్ట్రఅధ్యక్షుడు దూలం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన అధికారులకు సమ్మె నోటీసు అందించారు. అనంతరంమాట్లాడుతూ, సింగరేణిలో అద్దె వాహనాలు నడిపే డ్రైవర్లకు సైతం సీఎంపీఎఫ్ ఖచ్చితంగా చెల్లించాలని సింగరేణి యాజమాన్యం సర్క్యులర్ జారీ చేసిందన్నారు. దీంతో వాహనాల యజమానులు డ్రైవర్లకు చెల్లించే వేతనాల నుంచి డబ్బులు తగ్గించి వాటిని సీఎంపీఎఫ్‌కు జమ చేస్తామని చెప్తున్నారని తెలిపారు. ఇప్పటికే సగం వేతనాలు ఇస్తూ డ్రైవర్లను ఇబ్బందులు పెడుతున్న యజమానులు ఇంకా తగ్గిస్తే కుటుంబాలు జీవనం సాగించడం కష్టమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి అధికారులు సమస్య పరిష్కరించకుంటే వచ్చే నెల11నుంచి సమ్మెలోకి వెళ్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో కన్వేయన్స్ డ్రైవర్లు పాల్గొన్నారు.